క్లుప్తంగా

విజయవంతమైన కంటి వైద్య శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ నరేందర్

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని వైద్యాధికారి డాక్టర్ పరిక్షిత్ నరేందర్ ప్రారంభించారు. కంటి వైద్య సహాయకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 65 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఇందులో 22 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని రాంరెడ్డి లయన్స్‌కంటి ఆస్పత్రికి పంపించారు. లయన్ ఆమనగల్లు పీఆర్‌ఓ పాషా, సంయుక్త కార్యదర్శి బాలకృష్ణ, సభ్యుడు వెంకటయ్య, ఆస్పత్రి సిబ్బంది తిరుపతిరెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



రాఘవేందర్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో ఫిబ్రవరి 6 నుంచి నిర్వహించే శ్రీ వేదాద్రి లక్ష్మీ నర్సింహస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని టాస్క్ సీఈఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని ఆలయ నిర్వాహకులు ఆహ్వానించారు. సోమవారం నగరంలోని టాస్క్ కార్యాలయంలో ఆయనను ఆలయ ధర్మకర్త శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. నాయకులు వెంకట్‌రెడ్డి, అశోక్‌బాబు, నర్సింహులు, అజీజ్ ఉన్నారు.

విగ్రహావిష్కరణకు..

పట్టణంలో ఈ నెల 31న గౌడసంఘం ఆధ్వర్యంలో బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. కార్యక్రమానికి నల్గొండ జిల్లా హుజూర్‌నగర్ సీఐ గజ్జె చరమందగౌడ్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం సంఘం కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు అల్లాజీగౌడ్ ఆధ్వర్యంలో ఆయనను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. సంఘం నాయకులు యాదయ్యగౌడ్, గంగారవిందర్‌గౌడ్, నిరంజన్‌గౌడ్, బాలకృష్ణ, రాఘవేందర్, సతీష్‌గౌడ్, అల్లాజీ, గజ్జె నిరంజన్ పాల్గొన్నారు.

పారదర్శకంగా అర్హుల ఎంపిక

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల(రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా)కు అర్హుల ఎంపికను పారదర్శకంగా చేపడతామని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం నుంచి 24వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డివిజన్ పరిధి 109 గ్రామాల్లో ప్రత్యేకాధికారుల అధ్యక్షతన గ్రామ సభలు జరగనున్నాయని వెల్లడించారు. ఈ సభల్లో అర్హుల ఎంపికలో సలహాలు, సూచనలు, ఏమైనా అభ్యంతరాలుంటే అధికారులకు చెప్పాలని ప్రజలకు సూచించారు. ఆయా పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

బోరు మోటారు ప్రారంభం



మాడ్గుల: మండల పరిధి నల్లచెరువు గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో వేసిన బోరును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో.. సొంత నిధులతో బోరు వేయించానని తెలిపారు. అనంతరం గ్రామస్తులు కిషన్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహ్మద్ బాబా, వెంకట్ రెడ్డి, నరేందర్, ఈశ్వర్, నవీన్ గౌడ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలో గల శ్రీ చీకటి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఫిబ్రవరి 10 నుంచి 14వ తేదీవరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల్లో పాల్గొని కోరుతూ దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను సోమవారం ఆలయ చైర్మన్ మొకరాల రాజశేఖర్‌శర్మ ఆహ్వానించారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన ఆమె బ్రహ్మోత్సవాల సందర్భంగా తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

వసతిగృహం.. శిథిలం

వందల మంది విద్యార్థులతో కళకళలాడిన బీసీ వసతిగృహం నేడు వెలవెలబోతోంది. నాలుగు దశాబ్దాల పాటు విద్యాకుసుమాలను తీర్చిదిద్ది, భావిభారత పౌరులను సమాజానికి అందించిన గృహం.. అధికారుల నిర్లక్ష్యానికి వృథాగా మారి, శిథిలావస్థకు చేరువై కూలడానికి సిద్ధంగా ఉంది.

- నిరుపయోగంగా బీసీహాస్టల్ భవనం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- విలువైన స్థలం.. అన్యాక్రాంతమయ్యే అవకాశం



శిథిలావస్థలో బీసీ వసతిగృహ భవనం

ఆమనగల్లు: సరిపడా విద్యార్థులు లేరన్న కారణంతో బీసీ వసతిగృహ భవనాన్ని నిర్లక్ష్యం చేశారు. విద్యార్థులను ఆకట్టుకునేలా మరిన్ని వసతులు కల్పించి అభివృద్ధి చేయాల్సిందిపోయి.. సొంత భవనాన్ని వదిలేసి, అరకొర వసతులున్న అద్దె భవనంలోకి మార్చి సొంత భవనాన్ని వదిలేశారు. ఫలితంగా ఆరేళ్లుగా వృథాగా పడుంది. చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి.. పాడుబడిన బంగ్లాను తలపిస్తోంది. ఆమనగల్లు పట్టణం మధ్యలో ఉన్న భవన స్థలం అన్యాక్రాంతమయ్యే అవకాశం ఉందని, అదే స్థానంలో గురుకుల పాఠశాలను నిర్మించాలని ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

200 మంది విద్యార్థులు

సుమారు నాలుగు దశాబ్దాల క్రితం పట్టణంలోని మాడ్గుల రోడ్డులో పోలీస్ స్టేషన్ వెనుక బీసీ వసతిగృహాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాలతో పాటు నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలానికి చెందిన పలువురు సుమారు 200 మంది వసతిగృహంలో ఉంటూ విద్యను అభ్యసించేవారు. ఎంతో సౌకర్యంగా ఉండేది. ప్రజాప్రతినిధులు, అధికారుల ఉదాసీన వైఖరితో హాస్టల్లో సమస్యలు పెరిగి, విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది.

అద్దె భవనం టు ఎస్సీ వసతిగృహం

విద్యార్థుల సంఖ్య సరిగా లేదని, భవనం శిథిలావస్థకు చేరిందన్న కారణంతో 2016లో పట్టణంలోని కల్వకుర్తి రోడ్డులోని ఓ అద్దెభవనంలోకి మార్చారు. అక్కడ వసతుల లేమితో విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. దీంతో అద్దె వృథా అని భావించిన అధికారులు.. అక్కడి నుంచి పట్టణంలోని ఎస్సీ వసతిగృహంలోకి మార్చారు. విద్యార్థుల సంఖ్య మరింత తగ్గడంతో.. మొత్తానికి బీసీ వసతిగృహాన్ని 2018లో ఎత్తివేశారు. గుట్టుచప్పుడు కాకుండా ఇంత తతంగం జరిగినా.. నాయకులు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోలేదు. బీసీ వసతిగృహం లేకపోవడంతో ఈ ప్రాంత నిరుపేద బీసీ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..

బీసీ వసతిగృహాన్ని ఎత్తివేసిన అనంతరం ఆ భవనం నిరుపయోగంగా మారింది. అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా నిలిచింది. కోట్లాది రూపాయలు విలువ చేసే భవనం వృథాగా మారిందని, ఇదేస్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించాలని మున్సిపాలిటీ పాలకవర్గం ప్రయత్నించినప్పటికీ ప్రభుత్వం అంగీకరించలేదు. దుకాణ సముదాయం నిర్మించి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని గతంలో బీఆర్‌ఎస్ పాలకులు చెప్పినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఇదే స్థానంలో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఆహార భద్రత కార్డుల ప్రక్రియ నిరంతరం
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో సబావత్ మన్నికి మంజూరైన రూ.10 లక్షల బీమా చెక్కును సోమవారం ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. అర్హులందరికీ ప్రభుత్వం ఈ నెల 26 నుంచి ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందిస్తుందని తెలిపారు. కొత్తగా ఆహార భద్రత కార్డులు రానివారు ఆందోళన చెందవద్దని, రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. అర్హులై ఉండి, కార్డులు రానివారు ఈ నెల 21 నుంచి గ్రామ, వార్డు సభలలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అంతకుముందు నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామంలో వచ్చే నెల 7 నుంచి నిర్వహించే వేదాద్రి శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ.. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేశారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీ సింగ్, సింగిల్‌విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, నాయకులు శేఖర్‌గౌడ్, యాదయ్య, శ్రీనివాసమూర్తి, వెంకట్‌రెడ్డి, అశోక్‌బాబు, నర్సింహులు, అజీజ్ ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మునగనూర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం పురపాలక సంఘం పరిధి పలు వార్డుల్లో రూ.81 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. సీసీ, బీటీరోడ్లు, అంతర్గత డ్రైనేజీ లైన్ల నిర్మాణంతో మున్సిపాలిటీ రూపురేఖలు మారనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కమిషనర్ అమరేందర్ రెడ్డి, వైస్ చైర్ పర్సన్ హరిత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్

కడ్తాల్: ఉపాధ్యాయుల సమస్యలపై టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్, ఎంఈఓ సత్యనారాయణలతో కలసి ఫెడరేషన్ 2025 నూతన సంవత్సర కేలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలతో ఫెడరేషన్ ఏర్పడిందని, విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి, ఉపాధ్యాయుల శ్రేయస్సు కోసం పనిచేస్తుందని తెలిపారు. అదే ఒరవడిని కొనసాగిస్తూ, ప్రభుత్వ విద్యను కాపాడుకునేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు జంగయ్య, నాయకులు శంకర్‌నాయక్, మల్లయ్య, విజయ్‌కుమార్, సత్యనారాయణ, భీముడు, కౌసల్య, భాగ్యలక్ష్మి, పాండు, రవి, రాజు, కృష్ణ, శోభారాణి, బుచ్చమ్మ తదితరులు ఉన్నారు.

‘లక్ష డప్పులు’ జయప్రదం చేయండి



మంచాల: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జేఏసీ నాయకులు

మంచాల: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరుతూ ఫిబ్రవరి 7న నగరంలో నిర్వహించే వేల గొంతులు.. లక్ష డప్పుల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జేఏసీ గౌరవ అధ్యక్షుడు బోసుపల్లి ప్రతాప్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు కలిసి వచ్చే వర్గాలను కలుపుకొని, ముందుకు పోవాలని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం అన్ని వర్గాల ప్రజలకు జనాభా ప్రతిపాదికన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అందుకోసం మంద కృష్ణ మాదిగ చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. సమితి నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్, నాయకులు యాదయ్య, మల్లేశ్, కృష్ణ, శ్రీను, పాండు, యాదగిరి, యాదయ్య, రమేష్, అరుణ్, బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర తిరగరాయాలి

యాచారం: లక్ష డప్పుల కార్యక్రమంతో చరిత్ర తిరగరాయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబు అన్నారు. యాచారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అనుబంధ సంఘాల సమావేశం.. సమితి నియోజకవర్గ ఇన్‌చార్జి సిద్దాపురం శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ, నగరంలో ఫిబ్రవరి 7న నిర్వహించే వేయి గొంతులు.. లక్ష డప్పుల కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పాండు, ముత్యాలు, జంగయ్య, మహేశ్, సతీష్, సుధాకర్, శివకృష్ణ, బాలరాజు, కృష్ణ, అబ్బయ్య, సాయిలు, బాబు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుతో విప్లవాత్మక మార్పులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాధిక

ఇబ్రహీంపట్నం: ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సు విప్లవాత్మకమైన మార్పులు తెచ్చే సాంకేతిక పరిజ్ఞానమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక అన్నారు. విద్యార్థులు ఈ సాంకేతికత పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. సోమవారం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సర్టిఫికెట్ కోర్సును ఆమె ప్రారంభించి మాట్లాడారు. భవిష్యత్తు ఉద్యోగ అవసరాలు నిర్ణయించే అత్యంత కీలక రంగాల్లో ఒకటిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మారిందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఈ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సర్టిఫికెట్ కోర్సు ప్రధానంగా డేటా విశ్లేషణ, ఆటోమేషన్, అభ్యాస సామర్థ్యం వంటి వాటిపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేలా చేస్తుందని వివరించారు. దీనిపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పొందటమే కాకుండా.. సమాజంలో జరిగే మార్పుల్లో భాగస్వాములు అయ్యేందుకు సహాయపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ హృదయ రాజు, అధ్యాపకులు పవన్, రవికుమార్, ట్రైనర్ సంజీవ, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన నిందితులను శిక్షించాలి

మంచాల: ప్రధానోపాధ్యాయుడు కంభాలపల్లి రాములుపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధి ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 2024 డిసెంబర్ 21న తుక్కుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న క్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాములు కాలు, అయప్ప మాలధారణలో ఉన్న విద్యార్థికి కాలు తాకిందని తెలిపారు. ఇదే విషయంపై విద్యార్థికి సంబంధం లేని వ్యక్తులు, రాములను తీవ్ర పదజాలంతో దూషించడమే కాకుండా, విచక్షణా రహితంగా కొట్టారని ఆరోపించారు. బాలుడి కాలు మొక్కించి అవమానించారని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిధర్ గౌడ్, టీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు హరికిషన్, బీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు అజ్మత్‌ఖాన్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు జావేద్, ఉపాధ్యాయులు పద్మాషా, సుప్రియా, మోహన్‌గౌడ్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

సర్వే పూర్తి.. సభలు షురూ

ప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న మరో నాలుగు సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆహార భద్రత కార్డుల అర్హుల కోసం నిన్నమొన్నటి వరకు ఇంటింటికీ తిరిగి వివరాలను సేకరించిన అధికార యంత్రాంగం.. నేటి నుంచి గ్రామాలు, వార్డుల్లో సభలు నిర్వహించనుంది. ఇదే వేదికగా అర్హుల జాబితాను ప్రదర్శించనుంది.

- నేటి నుంచి గ్రామ, వార్డుల్లో సభలు
- సంక్షేమ పథకాల జాబితా వెల్లడించనున్న అధికారులు
- కొత్తగా దరఖాస్తుల స్వీకరణ



ఆమనగల్లు: సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వసంత

ఆమనగల్లు: ప్రభుత్వ సంక్షేమ పథకాల ఎంపిక కోసం నిర్వహించిన సర్వే అనంతరం ఈ నెల 21 నుంచి వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ వసంత తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ వార్డు అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మున్సిపాలిటీలో మూడు రోజుల పాటు వార్డు సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ఎంపిక జాబితాలను ప్రదర్శిస్తామని చెప్పారు. 21న చంద్రాయణపల్లితండా, జంగారెడ్డిపల్లి, 6,7,11,14 వార్డులలో, 22న ముర్తుజపల్లి, 5,8,12,15 వార్డులలో, 23న 3,10,13వ వార్డుల్లో సభలు జరగనున్నాయని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో వార్డు అధికారులు రమేష్, దామోదర్, శంకర్, వెంకటేశ్, హేమలత, మంజుల, రామకృష్ణ, ఎల్లయ్య, సత్యనారాయణ, బాగ్యలక్ష్మి, షర్ఫుద్దీన్, షేక్ అఫ్రోజ్, సంతోష తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: నూతన సంక్షేమ పథకాల అమలు నేపథ్యంలో ఈ నెల 21 నుంచి 23వరకు మండల పరిధి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుజాత తెలిపారు. 21న బాలాజీనగర్, అన్మాస్‌పల్లి, నార్లకుంటతండా, గడ్డమీదితండా, గోవిందాయిపల్లితండా, కొండ్రిగానిబోడ్‌తండా, చల్లంపల్లి, 22న చరికొండ, కర్కల్‌పహాడ్, ముక్తమాధారం, మద్రిపల్లి, రావిచేడ్, రేఖ్యతండా, కడ్తాల్, సాలార్‌పూర్, న్యామతాపూర్, 23న ముద్విన్, పల్లెచెలక, ఎక్వాయిపల్లి, మైసిగండి, పెద్దావేములోనిబావి, వాస్‌దేవ్‌పూర్, గానుగుమార్లతండా, గోవిందాయిపల్లిలో సభలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ సభల్లో పథకాలకు అర్హులైన వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

యాచారంలో..

యాచారం: సంక్షేమ పథకాల అమలు నేపథ్యంలో మండల పరిధి గ్రామాల్లో నేటి నుంచి గ్రామ సభలను నిర్వహించనున్నామని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల మంజూరుపై గ్రామ సభల్లో ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు. అభ్యంతరాలుంటే నోట్ చేసుకోవాలని చెప్పారు. తహసీల్దార్ అయ్యప్ప ఉన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

మాడ్గుల: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న పథకాల నేపథ్యంలో గ్రామాల్లో నిర్వహించనున్న సభలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ పద్మావతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నూతన పథకాలకు సంబంధించిన విధివిధానాలను గ్రామ సభల్లో ప్రజలకు వివరించాలని సూచించారు. జాబితాను చదివి, అర్హులను ఎంపిక చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: దండుమైలారం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ సీతారాములు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు దండుమైలారం, నెర్రపల్లి, ముకునూర్ గ్రామ ఫీడర్ల పరిధి వ్యవసాయ బావులు, బోర్లకు, గృహాలకు సరఫరా ఉండదని తెలిపారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆదిబట్ల మున్సిపాలిటీలో..

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ మంగళ్‌పల్లి, రాందాస్‌పల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ జయన్న తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు మంగళ్‌పల్లి, సాహెబ్‌గూడ, శేరిగూడ, చింతపల్లిగూడ, బొంగ్లూర్, మలిశెట్టిగూడ, రాందాస్‌పల్లి, ఎంపీపటేల్‌గూడ, సీవీఆర్ కళాశాల పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.